

లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

సరూర్‌నగర్, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని మహిళలకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేయర్ దుర్గాదీప్‌లాల్, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పి.సబితారెడ్డి పంపిణీ చేశారు. అనంతరం సబితారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని అధికార పార్టీ మహేశ్వరం నియోజకవర్గంలో అభివృద్ధిని అడ్డుకుంటున్నదని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో మంజూరైన కోట్లాది రూపాయల నిధులను రద్దు చేయడమే దీనికి నిదర్శనమని ఆమె అన్నారు. అభివృద్ధి చేతగాని ఈ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఆమె ధ్వజమెత్తారు. మహేశ్వరం అభివృద్ధి కోసం అసెంబ్లీలో కూడా కొట్లాడుతానని అన్నారు. నియోజకవర్గం అభివృద్ధి చెందితే సబితారెడ్డికి, బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే భయంతోనే నిధులు రద్దు చేసి, అభివృద్ధికి అడ్డుకట్ట వేస్తున్నారని ఆమె ఆరోపించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ఆర్.జ్ఞానేశ్వర్, బాలాపూర్ తహసీల్దార్ ఇందిరాదేవి, బీజేపీ, బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్లు కీసరి గోవర్ధన్‌రెడ్డి, అర్కల భూపాల్‌రెడ్డి, పలు డివిజన్ల కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



పీఎల్‌ఆర్‌కాలనీ ముఖ ద్వారాన్ని ప్రారంభిస్తున్న మేయర్ పారిజాతారెడ్డి

బాలాపూర్‌లో పీఎల్‌ఆర్‌కాలనీ ముఖద్వారం ప్రారంభం

సరూర్‌నగర్, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ బాలాపూర్ 17వ డివిజన్‌లో గల పన్నాల లక్ష్మారెడ్డి(పీఎల్‌ఆర్) కాలనీలో కొత్తగా నిర్మించిన కాలనీ ముఖ ద్వారాన్ని(ఆర్చిని) శుక్రవారం కౌన్సిల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డితో కలిసి మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజురోజుకూ కాలనీలు విస్తరిస్తున్నందున ఆయా కాలనీలను సులువుగా గుర్తించడానికి ఇలాంటి ముఖ ద్వారాలు ఉపయోగపడతాయని అన్నారు. అదేవిధంగా కాలనీల్లోని రోడ్లకు నంబర్లు సైతం రాసుకుంటే చిరునామా తెలుసుకోవడం సులువవుతుందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎర్ర మహేశ్వరీజైహింద్‌కుమార్, నాయకులు కళ్లెం ఎల్లారెడ్డి, పన్నాల కృష్ణారెడ్డి, తూళ్ల నరహరిగౌడ్, టేకుల సుధాకర్‌రెడ్డి, వంగేటి సుధాకర్‌రెడ్డి, పీఎల్‌ఆర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి: కార్పొరేటర్

చంపాపేట, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): చంపాపేటలోని మోడల్ మార్కెట్ ఎదుట ప్రధాన రహదారిపై నిత్యం పొంగిపొర్లుతున్న డ్రైనేజీ సమస్య పరిష్కారం కోసం కృషి చేయనున్నట్లు కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి అన్నారు. చంపాపేటలో భూగర్భ డ్రైనేజీ ఓవర్ ఫ్లో సమస్యను శుక్రవారం కార్పొరేటర్ జలమండలి సీజీఎం నాగేందర్‌కుమార్, డీజీఎం సన్యాసిరావుతో కలిసి పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ నూతన డ్రైనేజీ నిర్మాణ పనుల కోసం పలుమార్లు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. సమస్యను జలమండలి సీజీఎం, డీజీఎం దృష్టికి తీసికెళ్లగా వారు సానుకూలంగా స్పందించి క్షేత్రస్థాయిలో డ్రైనేజీ పరిశీలనకు వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ రమ్యభారతి, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి, నాయకులు సద్ది సందీప్‌రెడ్డి, యోగిరాజ్, వీరారెడ్డి, పాశం శ్రీశైలం, భానుక రమేష్, సుమిత్‌సింగ్, శ్రీకాంత్, అంజి, దొబ్బ శ్రీనివాస్, సుదర్శన్‌రెడ్డి, బిహారీ సాయిప్రసాద్ పాల్గొన్నారు.

రమేష్ కుటుంబానికి త్రిపుర గవర్నర్ పరామర్శ



గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డిని సన్మానిస్తున్న అఖిల్‌గౌడ్, కుటుంబ సభ్యులు

చంపాపేట, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ దివంగత ఆకుల రమేష్‌గౌడ్ కుటుంబ సభ్యులను శుక్రవారం త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి పరామర్శించారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని రమేష్‌గౌడ్ ఇంటికి వెళ్లిన గవర్నర్ ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. రమేష్‌గౌడ్ కుమారుడు లింగోజిగూడ కాంటెస్టెడ్ కార్పొరేటర్ ఆకుల అఖిల్‌గౌడ్‌ను గవర్నర్ యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గవర్నర్‌ను అఖిల్‌గౌడ్ ఘనంగా సన్మానించారు.

మదర్ డెయిరీలో 6 డైరెక్టర్ పదవులకు 12 మంది అభ్యర్థుల పోటీ

- అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు.. 13న ఎన్నికలు

హయత్‌నగర్, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): మదర్ డెయిరీలో 6 డైరెక్టర్ పదవులకు జరుగనున్న ఎన్నికల నామినేషన్ ప్రక్రియ గురువారంతో ముగిసిన సంగతి తెలిసిందే. మొత్తం 21 నామినేషన్‌లు దాఖలు కాగా శుక్రవారం 9మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో 12 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు ఎన్నికల అధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో రెండు డైరెక్టర్ పదవులకు నలుగురు అభ్యర్థులు పోటీలో ఉండగా.. నల్గొండ నుంచి నాలుగు డైరెక్టర్ స్థానాలకు 8మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. అనంతరం అభ్యర్థులకు గుర్తులను కేటాయించారు. ఈనెల 13న ఎన్నికలు జరుగనున్నాయి.

సిటీ బస్సుల్లో పురుషులకు ప్రత్యేక సీట్లు..?

- బస్సు వెనక సీట్ల వద్ద దర్శనమిచ్చిన స్టిక్కర్లు
- తాము ఏర్పాటు చేయలేదని ఆర్టీసీ వివరణ



బస్సులో పురుషుల స్టిక్కర్లు వేసి ఉన్న దృశ్యం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో పురుషులకు కూడా ప్రత్యేకంగా సీట్లను కేటాయిస్తే. మహిళలతో పాటు మగవారు కూడా తమకు రిజర్వ్ చేసిన సీట్లలో దర్జాగా కూర్చుని ప్రయాణిస్తే. మహాలక్ష్మి పథకం అమలులోకి వచ్చాక.. సీట్లు దొరకని చాలా మంది పురుషుల మదిలో మెదులుతున్న ఆలోచన ఇది. తాము టికెట్ కొని కూడా.. నిలుచుని ప్రయాణించాల్సి వస్తోందని అనేక మంది బహిరంగంగానే ఆగ్రహాన్ని వెలిబుచ్చుతున్న సందర్భాలున్నాయి. అయితే, నిలబడి వెళ్లడం ఎందుకు..? ఎవరో మనకు సీట్లను రిజర్వ్ చేసేది ఏంటి..? అనుకున్నారో ఏమో.. కొంత మంది హైదరాబాద్‌లోని సిటీ బస్సుల్లో వెనక సీట్ల వద్ద 'పురుషులు' అని రాసి ఉన్న రేడియం స్టిక్కర్లను అంటించారు. ఆ స్టిక్కర్లు పక్కాగా ఉండటంతో.. వాటిని నిజంగా ఆర్టీసీనే మగవారికి రిజర్వ్ చేసిందని అంతా అనుకుంటున్నారు. హయత్‌నగర్-మెహిదీపట్నం(156) మధ్య తిరిగే బస్సుల్లో ఈ స్టిక్కర్లు కనిపిస్తున్నాయి. వీటిని చూసిన కొంత మంది ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు. కాగా, సిటీ బస్సుల్లో ప్రత్యేకంగా అలాంటి స్టిక్కర్లు ఎక్కడా ఏర్పాటు చేయలేదని గ్రేటర్ ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

నిద్రావస్థలో డీటీఎఫ్

- అక్రమ నిర్మాణాలపై కనిపించని డీటీఎఫ్ చర్యలు
- పెద్దఅంబర్‌పేట్‌లో పెద్దఎత్తున వెలిసిన అక్రమ నిర్మాణాలు
- మున్సిపల్ అధికారులు సైతం పట్టనట్లు వ్యవహరిస్తున్న వైనం

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): హైడ్రా పేరు వింటే ఆక్రమణదారుల్లో వణుకుపుడుతోంది. నిబంధనలకు విరుద్ధంగా చెరువు, కుంటలకు చెందిన ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో వెలిసిన నిర్మాణాలపై హైడ్రాకు



పెద్దఅంబర్‌పేట్‌లో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భారీ షెడ్డు

ఫిర్యాదు అందిన వెంటనే వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటున్న సంగతి తెలిసిందే. ఆక్రమణలు జరిగాయని నిర్ధారణ అయితే తక్షణమే భవనాలను నేలమట్టం చేస్తున్న ఘటనలు రోజూ చూస్తున్నాం. హైడ్రా దూకుడుగా ముందుకు వెళ్తుంటే.. ఆక్రమణలపై చర్యలు తీసుకునేందుకు గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ కమిటీ(డీటీఎఫ్) పనితీరుపై అనేక ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అసలు డీటీఎఫ్ ఇప్పుడు ఉందా లేదా అని పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

అనుమానాస్పదంగా అధికారుల తీరు

నగర శివారులోని పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలో పలు వార్డుల్లో పెద్దఎత్తున అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ నిర్మాణాలపై వందల సంఖ్యలో ఫిర్యాదులు వచ్చినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మున్సిపాలిటీ కోట్ల రూపాయల ఆదాయం కోల్పోతున్నా మున్సిపల్ ఉన్నతాధికారుల నుంచి నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అక్రమ నిర్మాణదారులతో అధికారులు కుమ్మక్కు కావడంతోనే వాటిని కూల్చివేసేందుకు వెనుకడుగు వేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హైడ్రాను చూసి అయినా మున్సిపల్ అధికారులు ముందడుగు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారం ఉన్నా చర్యలు శూన్యం

నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చిన వెంటనే సంబంధిత పత్రాలను పరిశీలించి అవి అక్రమమని తేలితే మున్సిపల్ కమిషనర్‌కు కూల్చివేసే అధికారం ఉంది. అయితే పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ పరోక్షంగా అక్రమ నిర్మాణదారులకు సహకరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. తమకు కూల్చివేసే అధికారం లేదంటూ డీటీఎఫ్‌పై నెపం నెట్టేసి అధికారులు చేతులు దులిపేసుకుంటున్నారు. గత ఏడాది కాలంగా పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలో ఒక్క అక్రమ నిర్మాణాన్ని సైతం డీటీఎఫ్ కమిటీ ఆధ్వర్యంలో కూల్చివేసిన దాఖలాలు కనిపించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. డీటీఎఫ్, మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో అక్రమ నిర్మాణాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. అక్రమ నిర్మాణాలపై హైడ్రా తరహాలో డీటీఎఫ్ చర్యలు తీసుకునేలా ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ కార్యాలయం

చర్యలు తీసుకుంటాం..



మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాల వివరాలను డీటీఎఫ్‌కు అందజేస్తున్నాం. తమ పరిధిలో ఉంటే చర్యలు తీసుకుంటాం. అనుమతులు తీసుకున్న తర్వాతనే నిర్మాణాలు చేపట్టాలి.

- రవీందర్‌రెడ్డి, కమిషనర్, పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ

మురుగునీటి పైపులైన్ నిర్మాణానికి పరిష్కారం చూపుతాం

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

హయత్‌నగర్, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని ఉమర్‌ఖాన్ దాయర, కొహెడా, మునగనూరు, బ్రాహ్మణపల్లిలోని 8 వార్డులలో రూ. 6కోట్ల75లక్షలతో చేపట్టనున్న, పూర్తి అయిన పనులకు శుక్రవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని ప్రధాన సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ప్రధానంగా భూగర్భ డ్రైనేజీ సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వంతో చర్చించి మురుగునీటి కాల్వను ఏర్పాటు చేస్తామన్నారు. అధికారులు ప్రజా సమస్యలపై దృష్టి సారించాలన్నారు. సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించాలన్నారు. మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రత్యేక నిధులు తీసుకురావడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, తుర్కయంజాల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ, వైస్ చైర్‌పర్సన్ హరితాధన్‌రాజ్‌గౌడ్, కౌన్సిలర్లు వేముల స్వాతి అమరేందర్‌రెడ్డి, జ్యోతి, మల్లేష్, మంగమ్మ, శ్రీలత, రవీందర్‌రెడ్డి, సంగీత, నాయకులు సామ భీంరెడ్డి, కొంతం వెంకట్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

మృతుడి కుటుంబ సభ్యులకు 'బండి' పరామర్శ



వెంకటరమణ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

సరూర్‌నగర్: ఇటీవల తిరుపతికి వెళ్లి తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదానికి గురై దుర్మరణం పాలైన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుక్క వేణుగోపాల్ మేనల్లుడు గోనె వెంకటరమణ కుటుంబ సభ్యులను గురువారం రాత్రి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పరామర్శించారు. బడంగ్‌పేట్‌లోని ఎంసీఆర్ కాలనీలో నివసించే వెంకటరమణ ఇంటికి వచ్చిన సంజయ్.. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రమాదం జరిగిన తీరుపై వారిని అడిగి తెలుసుకున్నారు. ఆయన మృతిపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములుయాదవ్, బీజేపీ బడంగ్‌పేట్ శాఖ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్కు స్థలం కబ్జాను అడ్డుకున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

- పార్కు స్థలంలో నాటిన బోర్డు

హయత్‌నగర్, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్‌లోని తిరుమల హౌసింగ్ కాలనీలో కోట్లు విలువ చేసే పార్కు స్థలం కబ్జాను హయత్‌నగర్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు అడ్డుకున్నారు. కాలనీవాసుల నుంచి ఫిర్యాదు అందుకున్న అధికారులు శుక్రవారం ఉదయం తిరుమల హౌసింగ్ కాలనీకి చేరుకుని ప్రైవేటు వ్యక్తులు నాటిన బోర్డును తొలగించారు. దాని స్థానంలో సదరు స్థలం జీహెచ్‌ఎంసీకి చెందిన ప్లేగ్రౌండ్ లేదా కమ్యూనిటీ హాల్‌దని పేర్కొంటు బోర్డును ఏర్పాటు చేశారు. 1984 సంవత్సరంలో తిరుమల హౌసింగ్ కాలనీ పేరుతో లేఅవుట్ చేశారు. ఆ సమయంలో పార్కు కోసమని 2,995 గజాల స్థలాన్ని వదిలి పెట్టారు. పార్కు స్థలం అభివృద్ధి కోసమని హెచ్‌ఎండీఏ నుంచి రూ. 1 కోటి 20 లక్షలు మంజూరు చేశారు. అందులో భాగంగా పార్కు స్థలం చుట్టు ప్రహరీ నిర్మించారు. ఇదిలా ఉండగా రెండు రోజుల క్రితం ప్రైవేటు వ్యక్తులు వచ్చి సదరు భూమి ప్రైవేటు వ్యక్తులదని బోర్డును ఏర్పాటు చేశారు. దీంతో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దేవుజానాయక్, సెక్రెటరీ రమేష్‌గౌడ్, నాయకులు శ్రీనివాసచారి, భద్రారెడ్డి, వీరస్వామి, శ్రీనివాస్‌లు శుక్రవారం సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ పావణికి ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె సిబ్బందితో వచ్చి ప్రైవేటు వ్యక్తులు నాటిన బోర్డును తొలగించి జీహెచ్‌ఎంసీ బోర్డును నాటారు. బోర్డును ఎవరు తొలగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



పార్కు స్థలంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు

పారా ఒలంపిక్ విజేత జీవన్‌జీ దీప్తికి ఘనస్వాగతం



జీవన్‌జీ దీప్తికి స్వాగతం పలికి అభినందిస్తున్న వీరయ్య

ఓల్డ్ మలక్‌పేట, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): ఇటీవల పారా ఒలంపిక్‌లో బ్రాంజ్‌మెడల్ సాధించి శుక్రవారం స్వదేశానికి తిరిగి వచ్చిన జీవన్‌జీ దీప్తికి హైదరాబాద్ రాజీవ్ గాంధీ విమానాశ్రయంలో వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవన్‌జీ దీప్తి తెలంగాణ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో నిలిపిందన్నారు. ఆమెకు ఒలంపిక్ మెడల్ రావడం పట్ల తెలంగాణ ప్రజానీకం హర్షిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పారా ఒలంపిక్ క్రీడాకారులకు అన్నివిధాల సహాయ సహకారాలు అందిస్తుందన్నారు.

గతాన్ని మరిచి.. కొత్త జీవితాన్ని ప్రారంభించండి

- రౌడీ షీటర్లకు డీసీపీ కాంతిలాల్ సుభాష్ కౌన్సిలింగ్

సైదాబాద్, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): గతాన్ని మరిచి.. కొత్త జీవితాన్ని ప్రారంభించాలని రౌడీషీటర్లకు సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ కాంతిలాల్ సుభాష్ పాటిల్ సూచించారు. వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ ఉత్సవాల సందర్భంగా సౌత్ ఈస్ట్ జోన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లు, కమ్యూనల్ షీటర్లకు సైదాబాద్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు తమ కుటుంబసభ్యులు, పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని మంచిగా మారాలని హితువు పలికారు. సత్ప్రవర్తన కలిగిన వారిపై రౌడీ, కమ్యూనల్ షీట్లను తొలగిస్తామని చెప్పారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే పీడీ యాక్టు నమోదు చేస్తామని అన్నారు. రౌడీషీటర్లు నేరాలకు పాల్పడినా, ప్రోత్సహించినా తీవ్ర పరిణామాలు ఉంటాయని అన్నారు. ప్రతి ఒక్కరి కదలికలపై పోలీసుల నిఘా ఉంటుందని, ఏ చిన్న తప్పు చేసినా ఊరుకోమని, మారకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ స్వామి, సైదాబాద్, మలక్‌పేట, సంతోష్‌నగర్, చంద్రాయణగుట్ట ఏసీపీలు వెంకన్ననాయక్, శ్యాంసుందర్, మహమ్మద్ గౌస్, మనోజ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు రాఘవేందర్, కోలా సత్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.



రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న డీసీపీ కాంతిలాల్ సుభాష్



వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

సీసీ రోడ్డు పనులు ప్రారంభించాలి

వనస్థలిపురం, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): వర్షాలకు దెబ్బతిన్న రోడ్లపై నూతన సీసీ రోడ్డు పనులు తక్షణమే ప్రారంభించాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ నర్సింహారావునగర్ కాలనీలోని రోడ్లు వర్షాలకు దెబ్బతిని రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని కాలనీవాసులు కార్పొరేటర్‌కు సమాచారం అందించారు. శుక్రవారం సంబంధిత అధికారులతో కలిసి కార్పొరేటర్ కాలనీలో పర్యటించి రోడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో డీసీ దామోదర్, ఏఈ హేమునాయక్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం చెరువులో మరో మృతదేహం లభ్యం

ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 6: రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పెద్ద చెరువులో ఓ మహిళ తన పిల్లలను తోసేసి తానూ దూకిన ఘటనలో తల్లి మంగ, కుమారుడు శరత్ మృతదేహాలు గురువారం రాత్రి లభ్యం కాగా కుమార్తె ఒరుసు లావణ్య(18) మృతదేహం శుక్రవారం లభ్యమైంది. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు.



లావణ్య మృతదేహం

మృత్యువు నుంచి తప్పించుకున్న చిన్న కొడుకు

మంగ తన కూతురు లావణ్య, కుమారులు శరత్, విఘ్నేష్‌లతో కలిసి ఇబ్రహీంపట్నం చెరువు పెద్ద తూము వద్దకు చేరుకుంది. స్నానంచేసి వెళ్లిపోదామని చెప్పిన మంగ నీటి అంచున ఉన్న లావణ్య, శరత్, విఘ్నేష్‌లను చెరువులోకి తోసేసింది. అనంతరం తానూ దూకేసింది. అయితే తల్లి సహా కుమార్తె, పెద్ద కుమారుడు మృతిచెందగా చిన్న కుమారుడు విఘ్నేష్(5) మెట్ల సాయంతో ఒడ్డుకు చేరుకున్నాడు. గురువారం రాత్రి 7.30 గంటల సమయంలో విఘ్నేష్ ఏడుస్తూ కనిపించడంతో అతడిని చూసిన వారు పోలీసులకు సమాచారమిచ్చారు. అక్కడకు చేరుకున్న పోలీసులు, మున్సిపల్, ఫైర్ సిబ్బంది అదే రాత్రి మంగ, శరత్ మృతదేహాలను వెలికితీశారు.

లావణ్య పెళ్లి విషయంలో గొడవ

కాగా.. మంగ, తన భర్త కుమార్ ఇద్దరిదీ రెండో వివాహమే. కుమార్ మొదటి భార్యకు ముగ్గురు ఆడపిల్లలు కాగా.. మగబిడ్డ కోసం మంగను వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు శరత్, విఘ్నేష్ ఉన్నారు. అప్పటికే మంగకు మరొకరితో వివాహమై కూతురు లావణ్యతో పాటు కుమారుడు ఉన్నాడు. అయితే మొదటి భర్త సంతానమైన లావణ్య పెళ్లి విషయంలో మంగ, కుమార్ బుధవారం రాత్రి గొడవ పడ్డారని.. కుమార్ కొట్టడంతో మనస్తాపానికి గురైన మంగ పిల్లలతో సహా అఘాయిత్యానికి పాల్పడినట్లు బంధువులు చెబుతున్నారు.

పిస్తాహౌస్‌లో షార్ట్ సర్క్యూట్

- తప్పిన పెను ప్రమాదం



పిస్తాహౌస్ సెల్లార్‌లో మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

వనస్థలిపురం, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): షార్ట్ సర్క్యూట్‌తో పిస్తాహౌస్ సెల్లార్‌లో స్వల్ప అగ్నిప్రమాదం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వనస్థలిపురంలోని పిస్తాహౌస్ భవనంలోని సెల్లార్‌లో శుక్రవారం ఉదయం 11గంటలకు షార్ట్ సర్క్యూట్‌తో స్వల్ప అగ్నిప్రమాదం జరిగింది. ఇది గమనించిన పిస్తాహౌస్ సిబ్బంది తక్షణమే స్పందించి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. వెంటనే ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో ఫైర్ ఇంజన్ వచ్చి సెల్లార్‌లోని మంటలను ఆర్పివేసి మంటలను అదుపులోకి తీసుకవచ్చారు. కాగా సెల్లార్ పైన ఫ్లోర్‌లో ఉన్న ఆస్పత్రిలోని రోగులను ముందు జాగ్రత్తగా బయటకు తరలించారు. కాసేపటికి తిరిగి రోగులను యథావిధంగా ఆస్పత్రిలోకి తరలించారు. ఈ అగ్నిప్రమాదంలో సుమారు పదివేల ఆస్తినష్టం జరిగిందని పిస్తాహౌస్ నిర్వాహకులు తెలిపారు. సకాలంలో అగ్నిప్రమాదాన్ని గుర్తించడంతో ఆ సమయంలో హోటల్‌లో ఎవరు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.

మట్టి గణపతి విగ్రహాల పంపిణీ

జోన్‌బృందం: ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్ జోన్ పరిధిలోని ఆయా డివిజన్లలో మట్టి విగ్రహాలను శుక్రవారం పంపిణీ చేశారు. జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో లింగోజిగూడ వార్డు కార్యాలయంలో డివిజన్ ప్రజలకు జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి, సైదాబాద్ డివిజన్ సుబ్రహ్మణ్యంనగర్‌లోని జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ శైలజ, కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి, ఎస్‌బీహెచ్ కాలనీలో కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి, వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్, మన్సూరాబాద్ డివిజన్‌లలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో కార్పొరేటర్లు రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, కొత్తపేట డివిజన్‌లోని మోహన్‌నగర్ బచ్‌పన్ స్కూల్ విద్యార్థులకు సీటీఓ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్, చంపాపేట హస్తినాపురం డివిజన్‌లోని జడ్పీరోడ్‌లో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో కాలనీల ప్రజలకు కార్పొరేటర్ సుజాతానాయక్ మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు.



వనస్థలిపురంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు అజయ్‌యాదవ్, తదితరులు



లింగోజిగూడ వార్డు కార్యాలయంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి

మట్టి వినాయకులనే పూజించాలంటూ విద్యార్థుల ర్యాలీ

సరూర్‌నగర్: ప్రతిఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించుకుని పూజలు జరుపుకోవాలని నినాదాలు చేస్తూ బడంగ్‌పేట్‌లోని లార్డ్స్ స్కూల్ విద్యార్థులు శుక్రవారం బడంగ్‌పేట్ వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా తాము తయారు చేసిన మట్టి వినాయకులను ప్రదర్శిస్తూ.. పర్యావరణ పరిరక్షణ కోసం తయారు చేసిన మట్టి గణపతులనే పూజించాలని స్థానికులకు సూచించారు. స్కూల్ చైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ చైర్మన్ బైర్లు శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు సంతోష్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.